**మన ఓటే - మన భవిష్యత్ Your Vote Your Voice**

# పౌరుల జీవన ప్రమాణాల మెరుగుదలకు, సమాజ వికాసానికి, ప్రగతికి మేనిఫెస్టోలు వుండాలి.

**The Ballot is stronger than the bullet - abraham lincoln**

## జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్

ప్రజాస్వామ్యంలో సామాజికబాధ్యతకు, న్యాయానికి లోబడి స్వేచ్ఛ, సాధికార, సార్వభౌమత్వం, పారదర్శకత, జవాబుదారీ తనం చాలా అవసరం. నేడు పౌర ప్రయోజనం, సమాజ ప్రయోజనం, పౌరుల పాలన ద్వీతీయ స్థానానికి నెట్టివేయబడ్డాయి. పారిశ్రామిక వేత్తలు, కార్పోరేట్లు, అవినీతి పరులు, బంధుమిత్రుల ఆశ్రితుల ప్రయోజనాలు మిన్ను ముట్టాయి. ఇది నేటి దుర్మార్గ పరిస్థితి. పౌరుల వ్యక్తిత్వ వికాసాలకు, జీవన ప్రమాణాల మెరుగుదలకు, ప్రగతికి దరిదాపుల్లో లేని పాలన నేడు మన ముందు కనపడుతోంది.

మనకు ఇష్టమున్నా లేకున్నా ఎన్నికలు మన ముందుకు వచ్చేశాయి. వచ్చే ప్రభుత్వంలో మేం ఏమి చేస్తామో అంటూ మేనిఫెస్టోలు ద్వారా అనేక వాగ్దానాలతో ఊదరగొడుతున్నారు. గత 72 సం॥లుగా మీ జీవితాలను స్వర్గతుల్యం చేస్తామని, సంక్షేమ పథకాలను పెద్దపీట వేస్తామని వాగ్దానాలు చేస్తూ అనేక ప్రభుత్వాలు అధికారానికి వచ్చాయి. అనేక మేనిఫెస్టోలు వచ్చాయి. కానీ ప్రజల జీవన ప్రమాణాలు పెరగలేదు. స్థితిగతుల్లో మార్పు లేదు.

నేడు ఎన్నికల్లో డబ్బు, ప్రలోభాలు ప్రధానపాత్ర వహిస్తున్నాయి. కుల, మతాల బావోద్వేగాలు రెచ్చగొట్టడం ద్వారా ఎన్నికల్లో లబ్ది పొందవచ్చు అనే సెక్షన్స్ నేడు పెచ్చరిల్లుతున్నాయి.

**మనం ఎవరికి ఓటు వేయాలి?**

**ఏ ప్రమాణాలు ఆధారంగా అభ్యర్ధికి ఓటేయ్యాలి?** అనేది ప్రశ్నించుకోవాలి.

**ఐదు సంవత్సరాలు మన జీవితాల్ని ప్రభావితం చేసే శాసనకర్తలకు ఓటేసే ముందు ఆలోచించి ఓటెయ్యాలి.** ఎన్నికల్లో అభ్యర్థి నాకులం వాడని, నా మతం వాడని, 500 ఇచ్చాడని, మందు పోయించాడని ఓటేస్తే **మన భూమి, నీరు, గాలి సమస్తం కబ్జా చేస్తారు.** కాలుష్యం చేస్తారు. అభ్యర్థి నిజాయితీని, గుణగణాల్ని బేరీజు వేసుకుని ఓటేస్తే **మన భవిష్యత్తుకు మనం ఓటు వేసుకున్నట్లే.**

**అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు...ఏ పాటివాడో చూడాలి**
**ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు...**
**ఇప్పటిదాకా ఏం చేశాడో చూడాలి.**
**పెట్టుకున్న టోపీ కాదు... పెట్టిన టోపీ చూడాలి.**

– కాళోజి

**ఓటేసేముందు ఈ క్రింది కొన్ని అంశాల్ని పరిశీలిద్ధాం. ప్రజా జీవితాల్ని ప్రభావితం చేసే అభ్యర్ధికే ఓటేద్దాం.**

1. ఏ దేశం ఆరోగ్యంగా వుంటుందో ఆ దేశం కానీ, రాష్ట్రం కానీ సౌభాగ్యవంతంగా వుంటుంది. మన దేశంలో హెల్త్ ఇండెక్స్‌ను పరిశీలిస్తే ప్రపంచంలోని 195 దేశాల ఆరోగ్య సూచీని పరిశీలిస్తే మనం 154వ స్థానంలో అథమస్థితిలో వున్నాం. వైద్యం చేయించుకోవాలంటే సామాన్యుడికి అందని ద్రాక్షగా మారుతోంది. ఏ దేశమైనా ప్రయివేటు, కార్పోరేట్ గుత్తాధిపతుల స్వార్ధ ప్రయోజనాలకై ప్రజారోగ్యాన్ని ఫణంగా పెట్టకూడదు.

   ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో డాక్టర్లు, వైద్య సిబ్బంది చాలినంత లేరు. పౌష్టికాహారం, మంచినీరు, పరిశుభ్రమైన పరిసరాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. **ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చేవారికే మా ఓటని చాటాలి.**
2. విద్యారంగం బలోపేతం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుంది. బడి చుట్టూ సామాజిక చర్చ జరగాలి.

   విద్య వ్యాపారవస్తువుగా మారిపోయింది. పేద బాల, బాలికలు విద్యకు దూరం అవుతున్నారు. పాఠశాల విద్య ఆరిపోయే దీపంలా వుంది. జాతీయ అక్షరాస్యత 74% వుంటే రాష్ట్ర అక్షరాస్యత 67.5 మాత్రమే. అక్షరాస్యతలో మనరాష్ట్రం 33వ స్థానంలో వుంది. బడి బతకాలంటే నాణ్యమైన విద్యను అందించేలా, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పెంపు జరగాల్సి వుంది. **విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చేవారికే మన ఓటని చాటాలి.**
3. మహిళా హక్కులు అక్షరాల రూపంలోనే వున్నాయి. మహిళా రక్షణకు వున్న చట్టాలు సక్రమంగా అమలు

చేస్తే నూతన చట్టాల అవసరముండదు. 2010లో రాజ్య సభలో 33% మహిళా రిజర్వేషన్ చట్టమైనా నేటికీ అమలు కాకపోవటాన్ని ప్రశ్నించాలి? ప్రపంచంలోనే మహిళలకు రక్షణలేని దేశాలలో మొదటిస్థానం భారత్‌దే. **మహిళా రక్షణకు పూనుకునే వారికే మన ఓటు.**

సగానికి పైగా మహిళల్లో రక్తహీనత పౌష్టికాహార లోపం వుంది. రాష్ట్రంలో పౌష్టికాహార లోపంతో బాల్యం నీరుగారి పోతుంది. దేశం ఆకలి ఇండెక్స్‌లో 119 దేశాలలో 100వ స్థానంలో వుంది. ఆలోచించండి?

4. పనిచేసే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించి రాజ్యాంగంలో పొందుపర్చాలి. యువ భారతంగా కీర్తించబడుతున్న మన దేశంలో యువశక్తి ఉద్యోగాలు లేక అచేతనంగా తయారవుతోంది. దేశంలో సుమారు 10 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారు. దేశం ఏ విధంగా అభివృద్ధి చెంద గలదు.. **నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపించే వారికే మన ఓటు.**

5. అభివృద్ధి వికేంద్రీకరించబడాలి. వెనుకబడిన ప్రాంతాలకు ఉపాధికి అవకాశాలు వున్న పారిశ్రామిక విధానాల కోసమై ప్రశ్నించాలి. **ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచే అభివృద్ధిని ఏ విధంగా సాధించగలరో తెలియపర్చి ఆ అభివృద్ధికి పూనుకునే వారికే మన ఓటని చెప్పాలి.**

6. పర్యావరణం నేడు ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రధాన సమస్య. మరీ ముఖ్యంగా దేశంలోకానీ, రాష్ట్రంలోకానీ పర్యావరణ విధ్వంసం జరుగుతున్న తీరు చూస్తుంటే విస్మయం కలగకపోదు. మన రాష్ట్రంలోనే చూస్తే కెజి బేసిన్ గ్యాస్‌నిక్షేపాల వెలికితీత, ఇంకో ప్రక్క షెల్ గ్యాస్ నిక్షేపాల వెలికితీతకై ప్రయత్నాలు పెరిగాయి. కోనసీమ ప్రాంతం కుంగుబాటుకు గురై కనుమరుగవ్వ బోతుంది. బాక్సైట్ గనులు త్రవ్వకాలు, అణువిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలు ప్రజల జీవితాల్లోకి విషాన్ని చిమ్మటమే. **పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి వనరుల పరిరక్షణకు ఎవరు పూనుకుంటారో వారికే మన ఓటు.**

7. రైతు దేశానికి వెన్నుముక రైతే. కాని రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలైన లక్షలాది మంది రైతులకు పురుగు మందులే దిక్కవుతున్నాయి. వ్యవసాయాదారిత పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. **రైతు పెట్టుబడికి 50%పైగా గిట్టుబాటు ధరలను ఇచ్చే వారికే మన ఓటు.**

నరవానరాల దశనుండి నేటి ఆధునిక యుగం వరకు మానవజాతి మహా ప్రస్థానంలో మనిషి ప్రకృతి శక్తులతోను, సామాజిక శక్తులతోను నిరంతరం పోరాడాల్సి వచ్చింది. ఈ పోరాటాలన్నింటిలో మనిషిగా అండగా నిలిచింది శాస్త్ర విజ్ఞానమే. అటువంటి శాస్త్ర విజ్ఞానం ప్రజలందరికీ, దేశ ప్రయోజనాల కోసం అందుబాటులోకి రావాల్సివుంది.

ఏ విధమైన ఆధారాలు లేని సూడోసైన్స్‌ను ప్రచారం చేసే శక్తుల విషయంలో జాగురుకత వహించాల్సి వుంది. ఆ విధమైన వాదనలు చేసేవారు ఓటు రాజకీయాల కోసమే వాటిని ముందుకు తీసుకు వస్తారు.

నేడు ప్రభుత్వాధినేతలే మౌఢ్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. **శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతా వాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణ తత్వాన్ని పెంపొందించు కోవడంను ప్రాథమిక కర్తవ్యంగా రాజ్యాంగంలోని 51(హెచ్) పేర్కొంది.** మౌఢ్యాన్ని ప్రోత్సహిస్తున్నవారు రాజ్యాంగ కర్తవ్యాలను ఉల్లంగించేవారు ప్రభుత్వాధినేతలే.

ప్రజలలో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు గత 31 సం॥లుగా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోంది. విద్య, ఆరోగ్యం, పర్యావరణం, మూఢనమ్మకాలు తదితర అంశాపై ప్రజలలో అవగాహన కార్యక్రమాలను రూపొందిస్తోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టోలలో అంశాలు వుండాలి. **రాజకీయాల్లో, పరిపాలనలో ఉన్నతమైన మార్పుకు, సమాజ వికాసానికి, ప్రగతికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేవారికి, నిజాయితీ పరులకు ఓటు వేయాలని జనవిజ్ఞాన వేదిక విజ్ఞప్తి చేస్తోంది.**

***ఓటేసే ముందు... ఆలోచించడి... నిర్ణయం తీసుకోండి.***

---

**మనకు సంస్కారం వుంది కాబట్టి పిరాయింపు దారుల్ని, అవినీతి పరుల్ని చెప్పుతో కాదు కసితీరా ఓటుతో కొట్టాలి. ఏ నేత ఎక్కువ డబ్బు ఇస్తాడో పోల్చుకొని ఓటు వేయకండి. ఏ నేత చేతిలో మీ భవిష్యత్తు సురక్షితంగా వుంటుందో అంటువంటి వారికే ఓటు వేయండి. కొద్దిపాటి డబ్బు కోసం మీ ఆత్మగౌరవాన్ని (ఓటును) అమ్ముకోకండి.**

---

# జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్

**రి.నెం.1276/88** ఎఐపిఎస్ఎన్ అనుబంధం

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి,**

ప్రచురణ : అధ్యక్షులు : కె. త్రిమూర్తులు (94900 98971), ప్రధాన కార్యదర్శి : ఎస్.ఎన్.రమేష్ (94900 98539)